క్లుప్తంగా

నీటి వృథాను నియంత్రించాలి


వృథాగా పోతున్న నీరు

ఒంగోలు: స్థానిక అంజయ్యరోడ్డులో దుర్గా నర్సింగ్ హోం ఎదురుగా మంచినీటి పైపులైన్ దెబ్బతిని చాలానీరు వృథాగా పోతోంది. మున్సిపల్ అధికారులు తక్షణమే స్పందించి అరికట్టాలని ఒంగోలు నగర అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మారెళ్ల సుబ్బారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయమై అనేక మార్లు స్థానికులు మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేశామన్నారు. ఇప్పటికైనా అధికారులు జోక్యం చేసుకుని సమస్యను పరిష్కరించేందుకు చొరవ చూపాలని సుబ్బారావు కోరారు.

ఎంఆర్‌పీఎస్ ఒంగోలు అధ్యక్షునిగా ప్రభుదాసు


బాధ్యతలు స్వీకరిస్తున్న ప్రభుదాస్

ఒంగోలు: ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ ఆదేశానుసారం స్థానిక ఏ1 గ్రాండ్ ఫంక్షన్ హాలులో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఒంగోలు నగర అధ్యక్షునిగా గుంటూరి ప్రభుదాస్‌ను ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హాజరైన ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆదిమూలపు ప్రకాష్ ఆధ్వర్యంలో నూతన కమిటీ ఎంపిక జరిగింది. ప్రభుదాస్ మాట్లాడుతూ త్వరలోనే ఎంఆర్‌పీఎస్ కమిటీలు నియమించుకుంటూ బలోపేతానికి తనవంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో మహాజన సోషలిస్టు పార్టీ రాష్ట్ర నాయకుడు పాలడుగు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సయ్యద్ షహనాజ్‌కు డాక్టరేట్



డాక్టరేట్ అందుకుంటున్న షహనాజ్

ఒంగోలు మెట్రో: సూర్య దివ్యాంగుల చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకురాలు సయ్యద్ షహనాజ్‌కు ఏసియా ఇంటర్నేషనల్ కల్చర్ రీసెర్చ్ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసింది. గత నెల 29న బెంగళూరులోని యూనివర్సిటీలో నిర్వహించిన కార్యక్రమంలో షహనాజ్‌కు డాక్టరేట్ ప్రదానం చేసి అవార్డు కింద రూ.52,000 అందజేశారు. ఎంతోమంది దివ్యాంగులకు వసతి కల్పించి వారి బాగోగులను ఆమె చూసుకుంటున్నారు. ట్రస్టు ఆధ్వర్యంలో తన భర్త షేక్ సర్దార్‌బాషాతో కలిసి విస్తృతంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. కరోనా లాంటి విపత్కర పరిస్థితిలోనూ షహనాజ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఎంతో మందికి భోజన వసతి కల్పించారు. ఆమె సేవలను గుర్తించిన యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసింది. షహనాజ్‌కు డాక్టరేట్ రావడంపై ఒంగోలులోని ప్రముఖులు అభినందనలు తెలిపారు.

డయేరియాను నిర్మూలిద్దాం

- డీపీఎంఓ డాక్టర్ వాణిశ్రీ


మాట్లాడుతున్న వైద్యాధికారిణి డాక్టర్ వాణిశ్రీ

ఒంగోలు రూరల్: గ్రామాల్లో విపరీతంగా వ్యాపిస్తూ ప్రాణాంతక వ్యాధిగా మారిన డయేరియాను నిర్మూలన చేయాలని డీపీఎంఓ డాక్టర్ వాణిశ్రీ వైద్య సిబ్బందికి సూచించారు. మండలంలోని కరవది పీహెచ్‌సీ పరిధిలో ఉన్న కరవది వైద్యశాల, చేజర్ల వైద్యశాలల్లో నిర్వహించిన సమావేశాల్లో ఆమె మాట్లాడారు. పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వాణి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ డయేరియాను అదుపు చేయాల్సిన అవసరం జిల్లాలోని అన్ని గ్రామాల ప్రజలపై ఉందన్నారు. కేవలం అపరిశుభ్ర నీరు తాగడం, నిల్వ ఉంచిన ఆహారం తీసుకోవడం, ఈగలు వాలిన ఆహార పదార్థాలు తీసుకోవడం ద్వారా ఈ డయేరియా ఒకరి నుంచి మరొకరికి వ్యాప్తి చెందుతుందన్నారు. శారీరక పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత కలిగి ఉండాలని, అప్పుడే నిర్మూలన జరుగుతుందని అన్నారు. హెచ్ఈవో మోహన్‌రావు మాట్లాడుతూ ఓఆర్ఎస్ ప్యాకెట్లు తయారు చేసుకునే విధానం, వాడే విధానం గురించి వివరించారు. డీపీహెచ్ఎన్ సుగుణ మాట్లాడుతూ ఐరన్ టాబ్లెట్లు వాడే విధానం, జింక్ టాబ్లెట్లు వాడే విధానం, వాటి ఉపయోగాల గురించి వివరించారు. కరవది మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వాణి మాట్లాడుతూ ఇప్పటికే మండలస్థాయిలో అన్ని సచివాలయ కార్యదర్శులకు, తాగునీటి శాఖాధికారులకు పూర్తి ఆదేశాలను ఒంగోలు ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి ఇటీవల జరిగిన సమావేశంలో జారీ చేశారన్నారు. ఆ ఆదేశాలు పాటిస్తూ గ్రామ సచివాలయ కార్యదర్శులు మురుగునీటి కాలువల ప్రవాహం సాఫీగా జరిగేలా చూడాలన్నారు. సురక్షిత మంచినీరు సరఫరా చేసే విధానం గురించి వివరించారు. మురుగునీటి కుంటలు, వ్యర్థపదార్థాలు గ్రామాల్లో లేకుండా చర్యలు తీసుకోవాలని కార్యదర్శులను కోరారు. ఒంగోలు మండలం ప్రస్తుతం డయేరియాలో పూర్తిగా అదుపులో ఉందని, భయపడాల్సిన పరిస్థితి లేదని, వైద్యశాఖ, సచివాలయశాఖ సంయుక్తంగా పనిచేస్తుందని అన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌వోలు అశోక్, రాజేష్, ఏఎన్ఎంలు విజయలక్ష్మి, సరిత, వెంకట సుబ్బమ్మ, కృష్ణవేణి, స్టాఫ్ నర్సులు భానుమతి, విక్టోరియా, ఫార్మసిస్టు శ్రీధర్, ల్యాబ్‌టెక్నీషియన్ మహేష్ పాల్గొన్నారు. అనంతరం దేవరంపాడులో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సుందర్‌ప్రసాద్ నిర్వహించారు.

వైఎస్ జగన్‌ను కలిసిన గంగిరెడ్డి


వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో సుందరరామిరెడ్డి

చీమకుర్తి: వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని బుధవారం తాడేపల్లిలో చీమకుర్తి 20వ వార్డు కౌన్సిలర్ భర్త గంగిరెడ్డి సుందరరామిరెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. వైఎస్సార్ సీపీ మళ్లీ అధికారంలోకి వస్తుందనే భరోసాను వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కల్పించారని సుందరరామిరెడ్డి అన్నారు.

భక్తిశ్రద్ధలతో లక్ష్మీగణపతి హోమం


లక్ష్మీ గణపతి హోమంలో పాల్గొన్న దంపతులు, అర్చకులు

ఒంగోలు మెట్రో: క్రోధి నామ సంవత్సరం జేష్ఠ మాసం బుధవారం నగరంలోని గణపతి ఆలయాలలో అభిషేకాలు, అర్చనలు వైభవంగా నిర్వహించారు. స్థానిక పేర్నమిట్ట సిద్ధి బుద్ధి దేవస్థానంలో, కర్నూల్ రోడ్డు ఫ్లైఓవర్ బ్రిడ్జి కింద ఉన్న గణపతి ఆలయంలో, అద్దంకి బస్టాండ్ దగ్గర ఉన్న విజయ గణపతి దేవాలయంలో, బాపూజీ కాంప్లెక్స్ ఆవరణలో కొలువై ఉన్న వరసిద్ధి వినాయకస్వామి దేవస్థానంలో, నెల్లూరు బస్టాండ్ దగ్గరున్న సిద్ధి గణపతి దేవాలయంలో, రాజాపానగల్ రోడ్డులోని లక్ష్మీ గణపతి దేవస్థానంలో, శ్రీనగర్ కాలనీలోని సిద్ధి బుద్ధి సమేత గణపతి దేవాలయంలో, సమతా నగర్లోని కార్యసిద్ధి గణపతి దేవాలయంలో అర్చకులు ఉదయం ఏడు గంటలకు స్వామివారి మూల విరాట్‌కు సుగంధ పరిమళ ద్రవ్యాలు, పసుపు, కుంకుమ, గంధం, విభూది, చందనం, పన్నీరు, కొబ్బరి నీళ్లు, పాలు, పెరుగు, తేనె, చక్కెర, వివిధ రకాల పండ్ల రసాలతో పంచామృత అభిషేకం నిర్వహించారు. గణనాథునికి పంచ హారతులతో భక్తులకు దివ్య దర్శన భాగ్యం కల్పించారు. ఉదయం పది గంటలకు లక్ష్మీ గణపతి దేవస్థానంలో అర్చకులు దంపతులతో భక్తిశ్రద్ధలతో లక్ష్మీ గణపతి హోమాన్ని నిర్వహించారు. అనంతరం మంత్రపుష్పం, ఆశీర్వచనం, తీర్థ ప్రసాద వినియోగం జరిగింది. కార్యక్రమంలో స్థానిక భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి ఆశీసులు అందుకున్నారు.

వేణుగోపాలుడికి పుష్ప యాగ మహోత్సవం


గోపాలుని పుష్ప పూజ నిర్వహిస్తున్న అర్చకులు


పుష్పయాగ మహోత్సవంలో పాల్గొన్న మహిళలు

ఒంగోలు మెట్రో: క్రోధి నామ సంవత్సరం జేష్ఠ మాసం బుధవారం స్థానిక దక్షిణం బజారులో వెలసిన వేణుగోపాలస్వామి దేవస్థానంలో పుష్పయాగ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఉదయం ఏడు గంటలకు మంగళ వాయిద్యాలతో ఆలయ అర్చకులు వేద మంత్ర పఠనం, విష్వక్సేన పూజ, పుణ్యాహం, రక్షాబంధనం, కుంభార్చన, ఋత్విగ్వరణము, మేదిని పూజ, అర్చన, నివేదన, హారతి, మంత్రపుష్పం పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న భక్తులకు ఆలయ నిర్వాహకులు తీర్థ ప్రసాదాలు అందజేశారు. సాయంత్రం ఆరు గంటలకు అజస్ర దీపారాధన, మేదినీ పూజ, పుల్లంగి సేవను స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు ఘనంగా నిర్వహించారు. వివిధ రకాల పుష్పాలతో అలంకరణ చేసి పుష్ప యాగ మహోత్సవాన్ని వేడుకగా నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పచ్చదనంతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యం


పచ్చదనం ప్రాముఖ్యతను వివరిస్తూ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న విద్యార్థులు

ఒంగోలు సెంట్రల్: పచ్చదనంతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని క్విజ్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఎన్.సూర్యకళ్యాణ్ చక్రవర్తి అన్నారు. క్విజ్ హైస్కూల్లో బుధవారం గ్రీన్‌ఇండియా మిషన్ కార్యక్రమం నిర్వహించారు. చైర్మన్‌తో పాటు వైస్ చైర్మన్ డాక్టర్ ఎన్.గాయిత్రి ముఖ్య అతిథులుగా పాల్గొని విద్యార్థులకు చెట్ల ఆవశ్యకత, గ్లోబల్ వార్మింగ్, బయో డైవర్సిటీ, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ ఆంటోని మేరీ మాట్లాడుతూ వాతావరణంలో మార్పులు, ఉష్ణోగ్రతలో హెచ్చు తగ్గులు, సకాలంలో వర్షాలు పడకపోవడానికి చెట్లను నరికివేసి పచ్చదనానికి తూట్లు పొడవటమే కారణమని చెప్పారు. దీని వలన మానవ జీవిత మనుగడకు ముప్పు వాటిల్లుతుందని తెలిపారు. క్విజ్ విద్యా సంస్థలలో వెబ్‌సైట్‌ను ప్రారంభించి 5 వేల మొక్కలు నాటడానికి శ్రీకారం చుట్టినట్లు చెప్పారు. విద్యార్థులు పచ్చదనం ప్రాముఖ్యతను వివరిస్తూ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

ఘనంగా ఎస్వీ రంగారావు జయంతి


ఎస్వీ రంగారావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కాపు సంఘ నాయకులు

ఒంగోలు: విశ్వ నట చక్రవర్తి ఎస్వీ రంగారావు 106వ జయంతి కార్యక్రమాన్ని స్థానిక ప్రకాశం జిల్లా కాపు సంఘ కార్యాలయంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న కాపు సంఘ నాయకులు మాట్లాడుతూ నటనలో, దానంలో ఎస్వీ రంగారావుకు సాటి మరొకరు లేరన్నారు. తెలుగువాడి నటన, స్థాయిని విశ్వమంతా తెలిసేలా చేశారని, ఆయన సామర్థ్యం తరతరాలు చెప్పుకునే విధంగా, ఆయన గొప్ప కీర్తి ప్రతిష్టలు పొంది చిరస్మరణీయునిగా వెలుగొందారని పేర్కొంటూ ఎస్వీ రంగారావు చిత్రపటం వద్ద ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రకాశం జిల్లా కాపు సంఘ అధ్యక్షుడు కొక్కిరాల సంజీవ్‌కుమార్, కాపు నాయకులు గ్రంధి శ్రీనివాసరావు, తంజావూరు శ్రీనివాసమూర్తి, కొప్పోలు శ్రీనివాసరావు, చెన్నంశెట్టి శివ, అద్దేపల్లి మోహన్, మల్లెల చెన్నకేశవులు, చిక్కాల యలమంద, గుర్రం మాల్యాద్రి, ఉమ్మడిశెట్టి శ్రీనివాసరావు, మట్టా శ్రీనివాసరావు, పేస్ రాంబాబు, పసుపులేటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నగరంలో నాకాబందీ

ఒంగోలు టౌన్: నగరంలో బుధవారం పోలీసులు నాకాబందీ నిర్వహించారు. నగరంలోని అన్ని ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు. బహిరంగంగా మద్యం సేవిస్తున్న వారిని పట్టుకోవడంతో పాటు ద్విచక్ర వాహనాలను తనిఖీ చేశారు. వాహన చోదకులకు డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు చేశారు. సరైన పత్రాలు లేని వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్, ట్రిపుల్ రైడింగ్, నంబర్ ప్లేట్ లేని వాహనాలను సీజ్ చేశారు. గంజాయి రవాణా, అనుమానాస్పద వ్యక్తులు, కొత్త వ్యక్తుల వివరాలపై ఆరా తీశారు. ఒంగోలు శివారు ప్రాంతాలు, నిర్మానుష్య ప్రాంతాలు, వంతెనలు, కట్టడాలు, కల్వర్టులు, పార్కులు, రహదారుల పక్కన పాడుబడిన భవనాలతో పాటు మొత్తం 24 ప్రాంతాల్లో తనిఖీలు చేశారు. అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) కె.నాగేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ తనిఖీల్లో 120 మంది పోలీసు సిబ్బంది గ్రూపులుగా విడిపోయి తనిఖీలు చేపట్టారు. బహిరంగంగా మద్యం సేవిస్తున్న 90 మందిని అదుపులోకి తీసుకున్నారు. 12 మందిని డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో అదుపులోకి తీసుకున్నారు.


తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

9న జాబ్ మేళా

ఒంగోలు: నాన్ మేథమేటిక్స్ (సీఈసీ, హెచ్ఈసీ, బైపీసీ, ఒకేషనల్) విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం చొరవతో ఇంటర్‌బోర్డు, హెచ్‌సీఎల్ టెక్‌బీ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 9వ తేదీ జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ఇంటర్‌మీడియట్ ఆర్ఐవో ఎ.సైమన్ విక్టర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 75 శాతం ఉత్తీర్ణతతో ఇంటర్ చదివి ఉండాలన్నారు. హెచ్‌టీటీపీఎస్://బీఐటీ.ఎల్‌వై/టెక్‌బీఈఈజీవోఏపీ వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ఈ ప్రోగ్రాంకు నమోదు చేసుకున్న అభ్యర్థులకు ఎంపిక ప్రక్రియ మొదలవుతుందని, ఎంపిక సమయంలో కెరీర్ ఆప్టిట్యూడ్ టెస్టు (క్యాట్) పరీక్షలో ఎంపికైన అభ్యర్థులకు హెచ్ఆర్ ఇంటర్వ్యూ ఉంటుందని తెలిపారు. ఇంటర్వ్యూలో కూడా ఎంపికైన అభ్యర్థులు హెచ్‌సీఎల్ నుంచి టెక్‌బీ కార్యక్రమంలో చేరేందుకు ఆఫర్ లెటర్ పొందుతారన్నారు. ఈ టెక్‌బీ ట్రెనింగ్ ప్రోగ్రాం కాలపరిమితి ఏడాది ఉంటుందన్నారు. మొదటి మూడు నెలలు క్లాస్ రూమ్ ట్రెనింగ్ మధురైలో ఉంటుందని, చివరి 9 నెలలు అభ్యర్థి ఇంటర్న్‌షిప్‌నకు చెన్నైలోని హెచ్‌సీఎల్ క్యాంపస్‌కు వెళ్లాల్సి ఉంటుందని అన్నారు. ఇంటర్న్‌షిప్ సమయంలో అభ్యర్థికి నెలకు రూ.10 వేలు స్టైఫండ్ ఇవ్వడం జరుగుతుందని, ట్రెనింగ్ విజయవంతంగా పూర్తిచేసిన అభ్యర్థి రూ.1.70 లక్షల వార్షిక వేతనంతో ఉద్యోగిగా చేరవచ్చని అన్నారు. అభ్యర్థులు ఇంటర్‌తో ఆగిపోకుండా ఉన్నత చదువులు చదువుకునేందుకు హెచ్‌సీఎల్ విశ్వవిద్యాలయాలతో, ఎమిటీతో అనుబంధం కలిగి ఉందన్నారు. అందుకు సహకారం కూడా అందిస్తారన్నారు. పూర్తి వివరాలకు ఎస్.రాజ్‌కుమార్–7780323850 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

సమస్యలు పరిష్కరించాలని సమగ్రశిక్ష నాయకుల విజ్ఞప్తి


ఎమ్మెల్యేకి వినతిపత్రం ఇస్తున్న ఎస్ఎస్ఏ జేఏసీ నాయకులు

ఒంగోలు: సమగ్రశిక్ష జేఏసీ నాయకులు బుధవారం ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌ను ఆయన నివాసంలో కలిసి తమ సమస్యలు పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. మే, జూన్ నెలల వేతనాలు వెంటనే విడుదల చేయించాలని, గత ప్రభుత్వం ఇచ్చిన హామీలను కూడా ప్రస్తుత ప్రభుత్వం అమలు చేయాలని కోరారు. సమ్మె కాలపు జీతం కూడా వెంటనే ఇప్పించాలని కోరారు. డీఎస్‌సీలో వెయిటేజీ ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ పలు సమస్యలపై వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యు.కళ్యాణి, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్, ముఖ్య నాయకులు టి.రవికుమార్, రోజర్ బిన్నీ, ఆనంద్, రత్నకుమారి, సుల్తాన్‌బాషా, సంపత్, మాధవాచారి తదితరులు పాల్గొన్నారు.

బాబాల ఆశ్రమాలన్నీ మూసివేయాలి

ఒంగోలు: దేశంలోని బాబాల ఆశ్రమాలన్నీ మూసివేయాలని ప్రకాశం జిల్లా హేతువాద సంఘ అధ్యక్షుడు నార్నె వెంకట సుబ్బయ్య ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బాబా అన్నవాడిని కటకటాల వెనక్కు పంపాలని, బాబాలను పెంచిపోషిస్తున్న రాజకీయ నాయకులే అసలు నేరస్తులని మండిపడ్డారు. సోమవారం ఉత్తరప్రదేశ్‌లోని బోలేబాబా ఆశ్రమంలో జరిగిన తొక్కిసలాటలో 116 మంది చనిపోవడం జరిగిందని, దీనికి ఆ రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని అన్నారు. నష్టపరిహారం కూడా బోలేబాబా నుంచే వసూలు చేసి ఇవ్వాలన్నారు. ప్రజల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని సందుకొక బాబా తయారవుతున్నారన్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 51ఏ (హెచ్)లో ప్రశ్నించేతత్వం, శాస్త్రీయ ఆలోచన, మానవవాదం పెంచడం ప్రతి పౌరుని బాధ్యతని రాసుకోవడం జరిగిందని, మరి రాజ్యాంగాన్ని అమలుపరుస్తామని ప్రమాణం చేసిన నాయకులకు ఆ విషయం గుర్తుకురాకపోవడం విచారకరమని అన్నారు. బోలేబాబాను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని, దేశంలోని బాబాల ఆశ్రమాలన్నింటినీ మూసేయాలని అన్నారు. బాబా అన్నవాడిని కటకటాలకు పంపాలని, అపుడే హత్రాస్ సంఘటనలకు ఫుల్‌స్టాప్ పడుతుందని నార్నె వెంకట సుబ్బయ్య పేర్కొన్నారు.

పుట్టుకతో వచ్చే లోపాలు గుర్తించాలి


శిక్షణ శిబిరంలో మాట్లాడుతున్న వైద్యులు

ఒంగోలు టౌన్: పుట్టుకతో వచ్చే లోపాలను వీలైనంత త్వరగా గుర్తిస్తే సకాలంలో చికిత్స అందించి నయం చేసే అవకాశాలు మెరుగ్గా ఉంటాయని యన్‌డీసీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ భగీరథి చెప్పారు. రాష్ట్రీయ బాలల ఆరోగ్య కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ మెడికల్ కళాశాల కాన్ఫరెన్స్ హాల్లో మూడు రోజులపాటు నిర్వహించిన శిక్షణ శిబిరం బుధవారం ముగిసింది. సెకండ్ మెడికల్ ఆఫీసర్లు, స్టాఫ్ నర్సులకు ఇచ్చిన శిక్షణలో డా.భగీరథీ మాట్లాడుతూ.. నవజాత శిశువులను తల నుంచి పాదం వరకు పరీక్షించాలని, నెలలు నిండక ముందే పుట్టిన పిల్లలు, మెల్లకన్ను, కంటి శుక్లాలు, గ్రహణ మొర్రి, వంకర పాదాలు, వినికిడి లోపాలతోపాటు గుండెకు సంబంధించిన సమస్యలను గుర్తిస్తే సత్వర వైద్యం అందించవచ్చన్నారు. శిశువులకు రూ.8 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు విలువైన చికిత్సలు ఉచితంగా చేయనున్నట్లు తెలిపారు. అడాలసెంట్ బాలబాలికలకు ప్రత్యేక స్నేహపూరిత క్లినిక్‌లు నిర్వహించాలని, బడి బయట కౌమార బాలికలకు హిమోగ్లోబిన్ పరీక్ష నిర్వహించి అవసరమైన వారికి ఇంటివద్దనే నీలం రంగు ఐరన్ మాత్రలు అందించాలని సూచించారు. ప్రతి విద్యాధికారి తన పరిధిలో నెలలో ఒకసారైనా మెడికల్ స్క్రీనింగ్ క్యాంపు ఏర్పాటు చేయాలని, ప్రభుత్వ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు వైద్య పరీక్షలు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రీచందు, డాక్టర్ తిరుమలరావు, ఆర్‌బీఎస్‌కే సిబ్బంది పాల్గొన్నారు.

కేజీబీవీ ఆకస్మిక తనిఖీ

కొత్తపట్నం: మండలంలోని మోటుమాల గ్రామ పరిధిలో ఉన్న కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని పాఠశాలల రీజినల్ జాయింట్ డైరెక్టర్ (ఆర్‌జేడీ) రామలింగేశ్వరరెడ్డి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడి పలు వివరాలు సేకరించారు. అనంతరం కేజీబీవీ రికార్డులను పరిశీలించి నిర్వహణ పనితీరును గమనించారు. విద్యార్థులకు కిట్ల పంపిణీ జరిగిందా..? అని అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయ సిబ్బంది అన్ని సబ్జెక్టులకు ఉన్నారా.. లేదా..? అని అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజన పథకంపై విద్యార్థులను ఆరా తీశారు. సిలబస్ సకాలంలో పూర్తయిందా..లేదా..? అని పరిశీలించారు. విద్యార్థుల సమాధానాలకు ఆర్జేడీ చాలా సంతోష పడి విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ఒంగోలు ఎంఈఓ కిషోర్‌బాబు, కొత్తపట్నం మండల విద్యాశాఖ అధికారిని 2 టి.పద్మావతి, కేజీబీవీ ప్రిన్సిపాల్ అరుణకుమారి, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులతో మాట్లాడుతున్న ఆర్‌జేడీ రామలింగేశ్వరరెడ్డి

విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలి


విద్యార్థులకు స్టూడెంట్ కిట్లు అందిస్తున్న ఎమ్మెల్యే విజయకుమార్

చీమకుర్తి: విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలని ఎమ్మెల్యే బీఎస్ విజయ కుమార్ పిలుపునిచ్చారు. బుధవారం సంతనూతలపాడు జిల్లాపరిషత్ హైస్కూల్లో నిర్వహించిన మండల స్థాయి స్టూడెంట్స్ కిట్స్ పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఐఏఎస్ అయిన వారిలో ఎక్కువ మంది ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివిన వారని, మీరు కూడా ప్రభుత్వ పాఠశాలల్లో చదివి మంచి మార్కులతో బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు యూనిఫాం, నోట్‌బుక్స్, షూ ఉన్నటువంటి స్కూల్ కిట్లు అందించారు. కార్యక్రమంలో ఎంఈఓ వెంకారెడ్డి, ఇన్‌చార్జి హెచ్‌ఎం ఉమామహేశ్వరి, టీచర్లు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

గాంధీనగర్ పాఠశాలలో...

చీమకుర్తి గాంధీనగర్‌లోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ఎంఎంఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. ఫౌండేషన్ అధ్యక్షుడు థామస్ మాట్లాడుతూ విద్యార్థులకు సేవా కార్యక్రమాలు నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకుని విద్యాప్రమాణాలు మెరుగుపరచుకోవాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం చాట్ల శ్రీనివాసరావు, షేక్ సర్దార్, గొల్లపూడి వెంకట్రావు, రంగారావు, రత్నం పాల్గొన్నారు.